క్లుప్తంగా

నియామకం


బెస్త చంద్రం (ఫైల్)

రాజంపేట: రాజంపేట టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బెస్త చంద్రం నియమితులయ్యారు. రాజంపేట మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో గ్రామ ఉపాధ్యక్షుడిగా మ్యాకల నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల అధ్యక్షులు యాదవరెడ్డి తెలిపారు. సీనియర్ నాయకులు వీరన్నపటేల్, కిసాన్ సెల్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు షాదుల్, ఇమ్రాన్ అలీ, బీసీ సెల్ అధ్యక్షుడు సిద్ధరాములు పాల్గొన్నారు.

ఏబీవీపీ డిగ్రీ కళాశాల కమిటీ అధ్యక్షుడిగా జశ్వ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏబీవీపీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ చరణ్ బుధవారం తెలిపారు. అధ్యక్షుడిగా జశ్వ, కార్యదర్శిగా సమీర్, ఉపాధ్యక్షులుగా వంశీ, నవ్యలను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని వారు అన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా పోసు శివ



బీబీపేట: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా బీబీపేట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పోసు శివను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీబీపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు రంజిత్ గౌడ్ ఆధ్వర్యంలో పోసు శివను ఎన్నుకున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని శివ పేర్కొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని వినతి



భిక్కనూరు: ఐదు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అంతంపల్లి, తిప్పాపూర్, లక్ష్మీదేవునిపల్లి, రామేశ్వర్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు బుధవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. అక్కడ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతి పత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ సమావేశాన్ని జయప్రదం చేయాలి




నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ క్యాంపు కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహిస్తున్న యువజన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అస్పత్‌వార్ వినోద్ కోరారు. ఈ సమావేశానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, జహీరాబాద్ పార్లమెంట్ యువజన ఉపాధ్యక్షులు రామర్తి గోపి హాజరవుతున్నారన్నారు. అన్ని మండలాల యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

హైమాస్ట్ లైట్ ఏర్పాటు



మాచారెడ్డి: మంథని దేవునిపల్లిలో ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ అరవింద్, గ్రామస్తుల తరపున ఎంపీపీ నర్సింగ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, మద్దెల రాజు, నారాయణ, మల్లేష్, లింగారెడ్డి, బాలయ్య,శ్రీనివాస్ గౌడ్,బాలాగౌడ్,రవి ఉన్నారు.

ప్రచార పోస్టర్ల తొలగింపు



ఎల్లారెడ్డి: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మున్సిపల్ సిబ్బంది ఎన్నికలలో పోటీ చేస్తున్న వారికి సంబంధించిన ప్రచార పోస్టర్లను తొలగించారు. స్టిక్కర్లపై పెయింటింగ్ వేసి కనపడకుండా చేశారు. ప్రభుత్వ ఆస్తులపై కాని, ప్రైవేటు వారి అనుమతులు లేకుండా వారి ఇంటిపై ప్రచార పోస్టర్లు వేయరాదని అధికారులు ఎన్నికలలో పోటీ చేసే వారికి సూచించారు.

పచ్చని వనంపై గొడ్డలి వేటు

- రామారెడ్డి పరిధిలో పలుచోట్ల యూకలిప్టస్ చెట్ల నరికివేత
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అటవీ శాఖాధికారులు


గోకుల్ తండా అటవీ శాఖ యూకలిప్టస్(నీలగిరి) ప్లాంటేషన్‌లో నరికేసిన చెట్లు

రామారెడ్డి: జీవి మనుగడకు అడవులే ప్రధాన ఆధారం. అలాంటి వన సందను కంటికి రెప్పలా కాపాడాల్సిన అటవీ శాఖాధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా భారీ నీలగిరి చెట్లే గొడ్డలి వేటుకు బలవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెబుతున్నా అడవులను నాశనం చేసే వారిని మాత్రం అదుపు చేయలేపోతున్నారు. ఫలితంగా ఓ వైపు నాటుడు.. మరోవైపు నరుకుడు కార్యక్రమం యదేచ్ఛగా కొనసాగుతోంది. కన్నాపూర్ అటవీ రేంజ్ పరిధిలోని గోకుల్‌తండా నీలగిరి ప్లాంటేషన్(యూకలిప్టస్ ప్లాంటేషన్)లో పచ్చని నీలగిరి చెట్లపై నిత్యం గొడ్డలి వేటు పడుతోంది. ప్లాంటేషన్ విస్తరించి ఉండడంతో అక్కడక్కడ ఒకటి రెండు చెట్లు నరికేస్తూ ఒక్కదగ్గర వేసి తరలిస్తున్నారు. గత మంగళవారం ప్లాంటేషన్‌లో 50కి పైగా యూకలిప్టస్ చెట్లు నరికివేతలకు గురై కనిపించాయి. రామారెడ్డి మండలంలోని వివిధ రేంజీల పరిధి రెడ్డిపేట, సింగరాయపల్లి, మద్దికుంట, అన్నారం తదితర ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ లేక దర్జాగా అడవుల్లోకి వెళ్లి చెట్లు నరికివేస్తున్నారు. ఎక్కడ చూసినా అడవుల్లో చెట్లు నేలకొరిగి మొదళ్లు దర్శనమిస్తున్నాయి. వాటిని చూస్తే ఇటీవలే నరికి వేసినట్లు తెలుస్తోంది.

జంతువుల వేట కూడా..

మండలంలోని అటవీ సంపద యదేచ్ఛగా దోపిడీకి గురవుతోంది. జంతువుల వేట, చెట్ల నరికివేత, రంగురాళ్ల అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుందని ఇటీవలే జరిగిన ఘటనలతో స్పష్టమవుతోంది. అధికారులు కేసులు నమోదు చేస్తున్నా అడవి దోపిడీని మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. జంతువుల వేట అన్నారం, రెడ్డిపేట, సింగరాయపల్లి ప్రాంతాలలో జరుగుతుంటే, రామారెడ్డి మండలంలోని ఇతర ప్రాంతాలలో చెట్ల నరికివేతలు కొనసాగుతున్నాయి. నీలగిరి చెట్ల వేరు నుంచి మొదలు ప్రతీది వైద్య పరంగా వివిధ రోగాల నివారణకు వాడవచ్చని డాక్టర్లు చెబుతు న్నారు. దీంతో నీలగిరి చెట్లు అక్రమ రవాణాపై అక్రమార్కులు దృష్టి సారించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కఠినంగా వ్యవహరిస్తున్నాం

అడవిలోకి ప్రవేశించినా, చెట్లు నరికినా, జంతువుల వేటకు ప్రయత్నించినా కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తున్నాం. ప్రజలకు నిత్యం అటవీ సంరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

– దివ్య, మాచారెడ్డి రేంజ్ అధికారిణి

మోదీ చేసిన అభివృద్ధి గురించి చెప్పండి


మాట్లాడుతున్న బీజేపీ నేత బాణాల లక్ష్మారెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి మూడో సారీ ప్రధాన మంత్రిని చేయడానికి ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం డీపీఎల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా, మండల నాయకులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలకు సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి అందరిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంటులో బీబీ పాటిల్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. శనివారం ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరగబోయే సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. నేతలు పైడి ఎల్లారెడ్డి, అసెంబ్లీ ప్రభారి నరేందర్‌రెడ్డి, కన్వీనర్ లింగారావు, బీపీ రెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

ముదిరాజ్ హక్కుల సాధన కోసం ఉద్యమం


బస్వాపూర్‌లో మాట్లాడుతున్న నీల నాగరాజు

భిక్కనూరు: ముదిరాజ్ హక్కుల సాధన కోసం ఉద్యమించేందుకు వెనుకాడేది లేదని ముదిరాజ్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. బుధవారం బస్వాపూర్‌లో ముదిరాజ్ యువజన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ–డి నుంచి బీసీ–ఏలోకి మార్చి 2009లో వైఎస్సార్ ఇచ్చిన జీవోను వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజు విద్యార్థుల కోసం హైదరాబాద్‌లో ప్రభుత్వం ఉచిత వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజు యువజన సంఘం నేతలు మద్ది నాగరాజు,నీల ప్రశాంత్, గంగాధారి రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను గడప గడపకు వివరించాలి


నియామక పత్రం అందుకుంటున్న ప్రవీణ్‌గౌడ్

బాన్సువాడ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గడప గడపకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని కాంగ్రెస్ నేత బోనాల సుభాష్ అన్నారు. బుధవారం హన్మాజీపేట్‌లో కాంగ్రెస్ కమిటీ పునర్వ్యవస్థీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలలో 5 గ్యారంటీలు అమలు అవుతున్నాయన్నారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడిగా నాగులపల్లి సునీల్‌లను ఎన్నుకున్నారు. నేతలు బోనాల సాయిలు, వెంకాగౌడ్, షేక్ అక్బర్, సంజీవులు, దత్తు పాల్గొన్నారు.

చీకటి బతుకుల్లో వెలుగులు నింపేదే కవిత్వం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెరవే ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: చీకటి బతుకుల్లో వెలుగులు నింపేదే కవిత్వమని, సగటు మనిషి ధైర్యం కవిత్వమని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అన్నారు. తెరవే ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కవిత్వ లక్షణాలు ప్రయోజనాలు కరప్రతాలను ఆవిష్కరించారు. మార్చి 21న నిర్వహించే ప్రపంచ కవిత్వం దినోత్సవాన్ని తెరవే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందున కవులు, రచయితలు సాహితీ అభిమానులు పాల్గొనాలని గఫూర్ శిక్షక్ కోరారు. కార్యక్రమంలో తెరవే ప్రతినిధులు మంద పీతాంబర్, యెనిశెట్టి గంగాప్రసాద్, అల్లి మోహన్‌రాజ్, బి.నాగభూషణం, కాసర్ల రామచంద్రం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాపం పసివాళ్లు

- అనారోగ్యంతో తల్లి మృతి.. వదిలేసి వెళ్లిన తండ్రి
- అమ్మమ్మ సంరక్షణలో చిన్నారులు


అమ్మమ్మ, తాతయ్యతో చిన్నారులు

మాచారెడ్డి: ఇద్దరు ఆడ పిల్లల తర్వాత కుమారుడు పుట్టాడనే ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. బాబు పుట్టిన ఏడాదికి తల్లి అనారోగ్యంతో అసువులు బాసింది. ముగ్గురు పిల్లల్ని అత్తారింటి వద్ద వదిలి తండ్రి రాజు వలస వెళ్లాడు. వివరాలు..హుజూరాబాద్‌కు చెందిన బండి కిషన్ కుటుంబం కొద్ది రోజుల కిందట మాచారెడ్డి చౌరస్తాకు వలస వచ్చారు. ఇద్దరు ఆడ పిల్లల తర్వాత కుమారుడు పుట్టాడని కూతురు నందిని ఎంతో సంతోషించింది. ఆ సంతోషం ఎన్నో రోజులు లేదు. కుమారుడు పుట్టిన ఏడాదికే నాలుగు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. ప్రస్తుతం ఆ ముగ్గురు పిల్లల భారం రెక్కాడితే కానీ డొక్కాడని కిషన్ దంపతులపై పడింది. మనసున్న మారాజులు ఆ చిన్నారులను ఆదుకోవాలని కిషన్ దంపతులు వేడుకుంటున్నారు. దాతలు 9949155270 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయం చేయాలని కోరుతున్నారు.

సమాచారం..

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ మైనారిటీ గురుకుల ఇంగ్లిష్ మీడియం బాలుర, బాలికల ఉన్నత పాఠశాల్లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 31 వరకు గడువు పొడిగించినట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు నారాయణ, ప్రణీతలు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భిక్కనూరు/పెద్దకొడప్‌గల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25వ సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు భిక్కనూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని బుధవారం తెలిపారు. ఈ నెల 23లోగా ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



బాన్సువాడ: జిల్లాలో ఉన్న మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా మత్స్య సహకార పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గాదం సత్యనారాయణ అన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు సబ్సిడీ అందేలా చూస్తానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్య సంపదను దళారులే దోచుకున్నారని, దీంతో మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార పారిశ్రామిక సంఘం డైరెక్టర్ నరసబోయి, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణగౌడ్, లింగాబోయి తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



భిక్కనూరు: ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రకటన చేయడంతో భిక్కనూరు మండల కేంద్రంలో ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజుల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను ప్రకటించాడని కొనియాడారు. ముదిరాజు సంఘం మండలాధ్యక్షుడు బండి రాములు, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, ప్రతినిధులు నంద రమేశ్, గజ్జె సురేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



నిజాంసాగర్(జుక్కల్): తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చొరవతో బోరు బావుల తవ్వకం పనులు చేపడుతున్నారు. బుధవారం మాగి, మల్లూర్ గ్రామ పంచాయతీల్లో బోరు బావుల తవ్వకం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. వచ్చిన నిధులతో గ్రామ పంచాయతీల్లో బోరుబావుల తవ్వకం, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపడుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని లాడేగావ్ గ్రామంలో కూలీలు చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవార ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఎండలు మండుతుండటంతో ఉదయం పూట ఉపాధి పనులు చేయాలన్నారు. గ్రామంలోని వన నర్సరీని పరిశీలించారు.

కల్యాణ లక్ష్మిలో బంగారం జాడేది?

- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే


బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): ఆడబిడ్డల పెళ్లిళ్లు చేసిన తల్లిదండ్రులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.లక్ష చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వ చెక్కులవుతాయని లేకుంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెక్కులు అవుతాయని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. బుధవారం గోర్గల్ శివారులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం లేదన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, బలమైన ఈదురు గాలులకు మంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్ కార్యకర్తలపైన దౌర్జన్యంగా అట్రాసిటీ కేసులు పెట్టి హింసిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడరన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అన్ని వేళలా తాను అండగా ఉండి కాపాడుకుంటానని, ఎవరు కూడా అధైర్యపడవద్దని సూచించారు. జహీరాబాద్ పార్ల మెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, నర్సింహారెడ్డి, విఠల్‌రెడ్డి, యాటకారి నారాయణ, సత్యనారాయణ, బలరాం తదితరులున్నారు.

రైతులందరి రుణాలు మాఫీ చేయాలి


మాట్లాడుతున్న చైర్మన్ కపిల్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్యాంకుల్లో తీసుకున్న రైతుల రుణాలన్నీ ప్రభుత్వం మాఫీ చేయాలని సింగిల్ విండో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తాడ్వాయి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో బుధవారం సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్వల్పకాలిక రుణాల మాఫీ గురించి, రుణాల రెన్యూవల్, దీర్ఘకాలిక రుణాల వసూలు గురించి, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై చర్చించి తీర్మానించారు. ఈ సందర్భంగా ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. వైస్ చైర్మన్ ధర్మారెడ్డి, డైరెక్టర్లు, పాల కేంద్ర అధ్యక్షుడు గంగయ్య, బ్యాంకు మేనేజర్ రంజిత్, మానిటరింగ్ ఆఫీసర్ నగేష్, కార్యదర్శి నర్సిములు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- ఎంపీపీ దశరథ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి

రామారెడ్డి: వేసవి కాలంలో గ్రామాలలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, ప్రత్యేకాధికారులు చొరవ చూపాలని రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని రైతు వేదిక భవనంలో బుధవారం ఎంపీపీ దశరథ్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. మిషన్ భగీరథ, అటవీ, విద్యుత్ శాఖల్లోని సమస్యలపై చర్చించి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ఎంపీడీవో సవిత, తహసీల్దార్ రోజా తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ నమోదుపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎంఆర్‌వో ప్రవీణ్ కుమార్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): గ్రామాల్లో ప్రజలకు ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల ప్రాథమిక పాఠశాలలో బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో గల 80 ఏళ్లు పూర్తయిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఉందని, వారు దరఖాస్తు ఫారాలను అందించాలన్నారు. ఓటరు నమోదు, తొలగింపు కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గిర్దావార్ హన్మాండ్లు, ఆయా గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన ఉండాలి


సన్మానిస్తున్న విద్యాదాత సుభాష్‌రెడ్డి

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా జాతీయ మానవ హక్కుల కమిటీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మర్రి మహిపాల్‌ను బుధవారం విద్యాదాత సుభాష్‌రెడ్డి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దమల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ రాజగౌడ్, నేతలు సతీష్‌రెడ్డి, సురేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు


పాల్గొన్న గర్భిణులు, బాలింతలు, అధికారిణులు

దోమకొండ: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బుధవారం పోషణ పక్షంలో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వివరించారు. పురుషులతో వంట కార్యక్రమాలు, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పశుపోషణ కో–ఆర్డినేటర్ సుమలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు నిర్మల, రాణి పాల్గొన్నారు.

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం పోషణ అభియాన్ పోషణ మాసంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రేణుక మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరభ్యాసం చేశారు. చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలు కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో సునంద, వైద్యాధికారి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గర్భిణులు, బాలింతలు తల్లి పాల ప్రాముఖ్యతను తప్పకుండా తెలుసుకోవాలని ఎల్లారెడ్డి సీడీపీవో సరిత పేర్కొన్నారు. బుధవారం చీనూర్ అంగన్‌వాడి కేంద్రంలో పోషణ్ పక్వాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన చేయించారు. సూపర్‌వైజర్లు స్వరూప, ఈశ్వరీబాయి, హారతి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.